సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 27 | మే | 2025



'సహకారం'లో బదిలీలు

పీఏసీఎస్ సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా.. జిల్లాలో 85 మంది పర్మనెంట్ ఉద్యోగులు ఉన్నారు. 8లో



ఆక్రమణలపై నజర్ !

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రహదారిని ఆక్రమించి వెలిసిన వ్యాపార సంస్థలను అధికారులు తొలగిస్తున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 34° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఏకలవ్య కళాశాలల్లో వంద శాతం సీట్లు భర్తీ

భద్రాచలం అర్బన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ఖాళీగా ఉన్న 302 సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని ఈఎంఆర్ఎస్ కళాశాలలో కన్వీనర్ నాగేశ్వరరావు, ఆర్‌సీఓ అరుణకుమారి నేతృత్వాన కౌన్సెలింగ్ ఏర్పాటుచేయగా 577 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న 302 సీట్లలో మెరిట్ ప్రకారం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు భద్రాచలం కళాశాల ప్రిన్సిపాల్‌వందనాబీ దాస్ తెలిపారు. దీంతో కళాశాలల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు విజయ్‌కుమార్, సంజయ్ మల్కర్, ప్రశాంత్, నితిన్‌సింగ్, విజయేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో అప్రెంటీస్‌షిప్ అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్ఎం ఏ.సరిరామ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హత కలిగిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ ఇండియా వెబ్‌సైట్‌లో టీజీఎస్ ఆర్టీసీ లొకేషన్‌ను ఎంపిక చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే, ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జూన్ 10వ తేదీ లోపు నమోదుకు అవకాశముందని ఆర్ఎం ఓ ప్రకటనలో వెల్లడించారు.

బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రాహుల్ తదితరులు

భద్రాచలంఅర్బన్ : జిల్లా బ్యాడ్మింటన్ మీట్ బ్రోచర్‌ను ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి పరంధామరెడ్డి మాట్లాడుతూ.. జూన్ 7, 8 తేదీల్లో సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగనున్నాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే సింగిల్స్ జట్టుకు రూ.800, డబుల్స్/ మిక్స్‌డ్ డబుల్స్‌కు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, ప్రభుత్వ పాఠశాల / కాలేజీ విద్యార్థులకు రూ.200 మాత్రమే ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం సాధారణ విద్యార్థులు టీటీటీ. ట్రూస్కె జీస్పీ. జీ ద్వారా నమోదు చేసుకోవచ్చునని, ప్రభుత్వ విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్లతో పాటు ఎంట్రీలను 9059722803 నంబర్‌కు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో పి.హరి ప్రసన్న కుమార్, చంద్రకళ, నాగరాజు, హసన్, పి. ఉదయ్, అఖిల్ పాల్గొన్నారు.

గోదారికీ అదే సమస్య..



సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం - మహదేవపూర్ మధ్య ఏర్పడిన ట్రాఫిక్ జామ్

సరస్వతి పుష్కరాలకు ట్రాఫిక్ చిక్కులు

- రోడ్ల విస్తరణపై ప్రణాళిక లేకపోవడమే కారణం
- 2027 గోదావరి పుష్కరాలకు సైతం ఇదే సమస్య ఎదురయ్యే అవకాశం
- పాత రోడ్ల విస్తరణ, కొత్త మార్గాలు అభివృద్ధి చేస్తే భేష్
- ఇప్పుడు పనులు ప్రారంభిస్తేనే అప్పటికి సిద్ధం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాళేశ్వరం దగ్గర సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రమించింది. భారీగా నిధులు కేటాయించి పనులు చేపట్టింది. కానీ పుష్కరాలు మొదలయ్యాక తలెత్తిన ట్రాఫిక్ సమస్య భక్తులను ఇక్కట్ల పాలు చేసింది. పన్నెండు రోజుల పాటు జరిగిన పుష్కరాల్లో దాదాపు తొమ్మిది రోజులు ట్రాఫిక్ చిక్కులు భక్తులకు తప్పలేదు. నడి వేసవి, నట్టడవిలో భక్తులు నీళ్ల కోసం, నీడ కోసం అల్లాడిపోయారు. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లపై పెట్టిన శ్రద్ధ వాహనాల క్రమబద్ధీకరణ, అందుకు అవసరమైన రోడ్ల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణంపై లేకపోవడం వల్లే ఈ సమస్య ఎదురైంది. జయశంకర్ భూపాలపల్లి తరహాలోనే భద్రాద్రి జిల్లా కూడా అడవులు, కొండలు, వాగులు, నదులతో నిండి ఉంది. కాబట్టి ముందుస్తు ప్రణాళిక లేకుంటే 2027 గోదావరి పుష్కరాలకు ఇక్కట్లు తప్పవు. రోడ్డు మార్గాల విస్తరణపై ఇప్పటి నుంచే దృష్టి సారించాల్సిన అవసరముంది.

బాటిల్‌నెక్‌గా కిన్నెరసాని

జగదల్‌పూర్ – విజయవాడ జాతీయ రహదారి పరిధిలోకి వచ్చే కొత్తగూడెం – భద్రాచలం మార్గంలో భద్రాచలం వద్ద గోదావరిపైన, కొత్తగూడెంలో ముర్రేడు, గోదుమవాగులపైన రెండో వంతెనలు నిర్మించారు. కానీ పాల్వంచ దాటిన తర్వాత కిన్నెరసానిపై కొత్త వంతెన నిర్మాణం చేపట్టలేదు. గతంలో నిర్మించిన వంతెన మీదుగానే రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ రెండో వంతెన నిర్మించకుంటే పుష్కరాల సమయంలో ఈ వంతెన బాటిల్‌నెక్‌గా మారి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. రెండో వంతెన నిర్మాణానికి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా గతేడాది జూన్‌లోనే రూ. 20.20 కోట్లు కేటాయించింది. కానీ ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. ఇకనైనా జాప్యం చేయకుండా పనులు ప్రారంభించి గోదావరి పుష్కరాల నాటికి కొత్త వంతెన అందుబాటులోకి వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది.

ఇల్లెందు పనులు ఇంకెప్పుడు..

కొత్తగూడెం – ఇల్లెందు – మహబూబాబాద్ మీదుగా వలిగొండ వరకు జై శ్రీరామ్ పేరుతో జాతీయ రహదారి 930పీ విస్తరణ పనులు రెండేళ్లుగా టెండర్ల దశలోనే మగ్గిపోతున్నాయి. ఈ రోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, అటవీ శాఖ అనుమతులు వంటివి చివరి దశలో ఉన్నాయి. ఇల్లెందు – కొత్తగూడెం మధ్య నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తే హైదరాబాద్ నుంచి భద్రాచలం వచ్చే వాహనాలను ఇల్లెందు మీదుగా మళ్లించేందుకు వీలుంటుంది. ఫలితంగా ఖమ్మం –కొత్తగూడెం – భద్రాచలం మార్గంపై ఒత్తిడి తగ్గుతుంది. అలాగే మోరంపల్లి బంజర నుంచి బూర్గంపాడు మీదుగా సారపాక వరకు ఉన్న రాష్ట్ర రహదారిని కూడా విస్తరించాలి. దీంతో పాటు భద్రాచలం – దుమ్ముగూడెం – చర్ల – వాజేడు రహదారిని కూడా ట్రాఫిక్ మళ్లింపు విషయంలో పరిగణనలోకి తీసుకోవచ్చు.

నాలుగు లేన్లుగా చేస్తేనే..

ప్రస్తుతం తిరిగే వాహనాల రద్దీకే కొత్తగూడెం – ఖమ్మం రహదారి సరిపోవడం లేదు. ఈ మార్గంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడం కష్టంగా మారింది. మరీ ముఖ్యంగా తల్లాడ నుంచి ఖమ్మం వరకైతే అసాధ్యమనే చెప్పాలి. అయితే ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చివరి దశకు రావడంతో వైరా – ఖమ్మం మధ్య ట్రాఫిక్ సమస్య తీరినట్టే కానీ.. తల్లాడ – కొత్తగూడెం వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే కొత్తగూడెం – తల్లాడ – వైరా – జగ్గయ్యపేట వరకు ఉన్న 100 కి.మీ. రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఈ మార్గానికి జాతీయ హోదా సాధించడంతో పాటు త్వరితగతిన పనులు చేపడితే పుష్కరాల నాటికి ట్రాఫిక్ చిక్కులు రావు. కనీసం తల్లాడ – కొత్తగూడెం మార్గాన్ని అయినా వేగంగా విస్తరించాల్సిన అవసరం ఉంది. అలాగే భద్రాచలం – సారపాక – బూర్గంపాడు – కుక్కునూరు – అశ్వారావుపేట మీదుగా రాజమండ్రి వరకు గల రోడ్డును గతంలో జాతీయ రహదారిగా గుర్తించారు. కానీ పోలవరం కారణంగా ఈ రోడ్డు అభివృద్ధి పనులు పక్కన పెట్టారు. దీంతో ఈ జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను సారపాక – బూర్గంపాడు – ములకలపల్లి – దమ్మపేట – అశ్వారావుపేటగా మార్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ట్రాఫిక్ చిక్కులు ఎదురైనప్పుడు వాహనాలు మళ్లించేందుకు ప్రత్యామ్నాయమార్గంగా ఉపయోగపడుతుంది.

బరువెక్కిన గుండెలతో | నిష్క్రమణ..



దక్షిణం వైపు దుకాణాలను ఖాళీ చేస్తున్న వ్యాపారులు

- దుకాణాలు ఖాళీ చేస్తున్న వ్యాపారులు
- రామాలయ మాడ వీధుల్లో భూ సేకరణకు నాంది

భద్రాచలం : నిత్యం శ్రీరామ నామస్మరణలతో తన్మయత్వం, రామయ్య చెంతకు వచ్చే భక్తులతో ఆత్మీయ పలకరింపులు, రామనామ కీర్తనల నడుమ జీవనయానం.. ఇవీ రామాలయ పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు సాగించే వారి జీవన శైలి. ఇవన్నీ ఇక నుంచి దూరం కానున్నాయనే బాధ గుండెలను పిండేస్తున్నా.. తప్పనిసరి పరిస్థితుల్లో దుకాణాలను ఖాళీ చేస్తున్నారు. జీవనోపాధి దూరం కావడంతో పాటు భద్రాచల రామయ్యతో ఉన్న అనుబంధం ఇక వారికి అనుభూతులుగానే మిగలనున్నాయి.

విస్తరణకు నాంది..

రామాలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధుల విస్తరణకు ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణ ప్రారంభమైంది. ఇప్పటికే ఆర్‌డీఓ ఆధ్వర్యంలో నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయగా, ఆయా స్థలాల్లోని దుకాణాలను యజమానులు, అద్దెదారులు ఖాళీ చేయడం ప్రారంభించారు. పడమర మెట్ల వైపు, దక్షిణ భాగంలో ఉన్న దుకాణాలన్నింటినీ దాదాపుగా ఖాళీ చేశారు. సోమవారం అక్కడి దుకాణాలను తొలగించి బొమ్మలు, వస్తువులను వాహనాల ద్వారా తరలించారు. కాగా భూ సేకరణ కోసం ఖాళీ చేసిన చిరు వ్యాపారుల్లో అత్యధికంగా అద్దెకు ఉంటున్న వారే. దీంతో తమకు ప్రభుత్వమే కాంప్లెక్స్ నిర్మించి అందులో దుకాణాలను కేటాయించాలని కోరుతున్నారు. ఈ మేరకు మంత్రులను, స్థానిక ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సైతం అందజేశారు. కాగా, దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఆ ఎనిమిది మంది ఖాళీ చేస్తేనే..

కాగా మాడ వీధుల విస్తరణలో భూ సేకరణకు ప్రభుత్వం రూ. 35 కోట్లు విడుదల చేసింది. ఇందులో అందరూ నష్టపరిహారం తీసుకోగా ఎనిమిది మంది మాత్రం నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పరిహారం సరిపోవడం లేదని, తాము ఖాళీ చేసేది లేదని భీష్మించారు. దీంతో ప్రస్తుతం ఇతరులు ఖాళీ చేసినా.. వీరు కూడా ఖాళీ చేయకుంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని ఆలయ అధికారులకు అందించే పరిస్థితి లేదు. భూమి మొత్తం అందకుంటే తదుపరి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ ఎనిమిది మందితో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. వారు అంగీకరించకపోతే న్యాయపరంగా ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అందరి చూపు ఆ ఎనిమిది మంది వైపే ఉంది. జిల్లా అధికారులు సైతం దీనిపై త్వరగా దృష్టి సారించి భూ సేకరణ పూర్తయ్యేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- భద్రాచలం భగవాన్‌దాస్ కాలనీకి చెందిన సోళ్ల రత్నమ్మ.. అశ్వాపురం మండలం చింతిర్యాల పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 80/3, 80/4లో 1.03 ఎకరాల భూమి తన సోదరి మరియమ్మ పేరున ఉందని, ఆమె మరణించినందున వారసుల పేరున పట్టా మార్చిడి చేయాలని దరఖాస్తు చేయగా కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ గాంధీనగర్‌కు చెందిన నడిగిరి మణికంఠ తాను హీమోఫీలియా వ్యాధితో బాధపడుతున్నానని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో ఏ పనీ చేయలేకపోతున్నానని, దివ్యాంగ పింఛన్ కోసం సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరగా ఆ దరఖాస్తును డీఎంహెచ్‌ఓకు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న పావురాల రామతులశమ్మ.. తాను రజకురాలినని, ఇస్త్రీ చేస్తూ ముగ్గురు కుమార్తెలను పోషిస్తున్నానని, పాల్వంచ మున్సిపాలిటీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఒక గదిని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేయగా మున్సిపల్ కమిషనర్‌కు పంపించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోకి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన పెనగడప పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది సక్రమంగా పని చేస్తేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీలో కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, కాలానుగుణ వ్యాధులకు తీసుకుంటున్న చర్యలను డాక్టర్లు భర్జర్, నేహా అంబ్రీన్‌ను అడిగి తెలుసుకున్నారు.

20 పడకలతో కోవిడ్ వార్డు

ఖమ్మంవైద్యవిభాగం: దేశంలోని పలు ప్రాంతాల్లో కరోనా కేసులు నమోదవుతున్నాయనే సమాచారంతో ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు సోమవారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ ప్రత్యేక వార్డు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇరవై పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేయగా, అనుమానిత కేసులు ఉంటే వారికి చికిత్స చేయనున్నారు. అయితే, కరోనా సోకినట్లు గుర్తించడానికి జిల్లాలో ర్యాపిడ్ కిట్లు కానీ ఆర్‌టీపీసీఆర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. ఈనేపథ్యాన జిల్లాకు 3వేల కిట్లు సరఫరా చేయాలని ఉన్నతాధికారులకు నివేదించారు.

సర్వేయర్లుగా రాణించాలి

శిక్షణా తరగతుల ప్రారంభంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి: కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ మైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే చేసేందుకు సర్వేయర్లుగా ఎంపికైన 426 మందికి శిక్షణ ఇస్తున్నామని, అభ్యర్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. ప్రభుత్వ కొత్త భూరికార్డుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మొత్తం 50 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, రెండు బ్యాచ్‌లుగా విభజించి ఉదయం థియరీ, మధ్యాహ్నం క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి సర్వేపై శిక్షణ ఇస్తారని వివరించారు. తరగతులకు హాజరైన అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లను ప్రత్యేక కౌంటర్ల ద్వారా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వారికి సర్వే గొలుసులు, కాలిక్యులేటర్, స్కేల్, పెన్సిల్, నోట్ బుక్స్‌తో పాటు స్టడీ మెటీరియల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏడీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ కిట్లు అందజేస్తున్న కలెక్టర్

కేసులు సత్వరమే పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం లేకుండా సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై బాధితులు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలను తీసుకోవడం ద్వారా వారికి న్యాయం చేయాలని ఆదేశించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

టేకులపల్లి : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజు సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం ఆయన టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చేలా మెలగాలని సూచించారు. నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న రోహిత్‌రాజు

ఉపాధ్యాయులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

డీఈఓ వెంకటేశ్వరా చారి

పాల్వంచ: ప్రస్తుతం తరగతి గది డిజిటల్ తరగతి గదిగా మారనున్న తరుణంలో ఉపాధ్యాయులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా విద్యా బోధన చేయాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. స్థానిక కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా కృషి చేయాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని, తద్వారా ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందని వివరించారు. అనంతరం కేటీపీఎస్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న హిందీ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. భోజనం చేసి కోర్సు డైరెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి ఎ.నాగ రాజశేఖర్, సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఎస్‌కే.సైదులు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

ఉపాధి పనుల పరిశీలన

తిప్పనపల్లి, రావికంపాడులో కేంద్ర బృందం పర్యటన

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి, రావికంపాడు గ్రామాల్లో సోమవారం కేంద్ర బృందం సభ్యులు రాకేష్‌కుమార్, అమిత్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వారు పరిశీలించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మట్టి పనులను తనిఖీ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు సదుపాయాల కల్పన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, నీడ కోసం టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఏర్పాటు చేయడం లేదని, పలుగు పారలు ఇవ్వడం లేదని కూలీలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మునగ పంట సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. రుణాల మంజూరు, రికవరీ ఎలా ఉన్నాయని స్వయం సహాయక సంఘాల మహిళలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ ఉన్నారు.

నేడు పాల్వంచకు..

పాల్వంచరూరల్ : కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈజీఎస్, ఐకేపీ శాఖలకు చెందిన అభివృద్ధి పనుల పరిశీలనకు మంగళవారం కేంద్ర బృందం సభ్యులు రాకేష్‌కుఉమార్, అమిత్‌కుమార్ పాల్వంచ మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు కిన్నెరసాని, 12 గంటలకు తోగ్గూడెం గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు.



చంద్రుగొండ : నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, పక్కన విద్యాచందన

డీర్‌పార్కును అభివృద్ధి చేయాలి

- వెలుగుమట్ల తరహాలో తీర్చిదిద్దాలి
- ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్

పాల్వంచరూరల్ : కిన్నెరసాని డీర్‌పార్క్‌ను అభివృద్ధి చేయాలని, ఖమ్మంలోని వెలుగుమట్ల పార్కు తరహాలో తీర్చిదిద్దాలని ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ సూచించారు. పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని సోమవారం ఆయన సందర్శించారు. వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టు పనితీరు, డీర్‌పార్కులోని దుప్పులను, అద్దాల మేడ, కాటేజీలను పరిశీలించారు. పనుల వివరాలపై సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. కిన్నెరసాని నుంచి అడవి దున్నలు అధికంగా సంచరించే రేగళ్ల ఫారెస్ట్ వరకు సఫారీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. చిల్డ్రన్స్ పార్కును కూడా అభివృద్ధి చేయాలని చెప్పారు. ఆయన వెంట రేంజర్ కవిత మాధురి, బీట్ అధికారి ఉమాదేవి, వైల్డ్‌లైఫ్ సిబ్బంది ఉన్నారు.



కిన్నెరసానిలో పర్యటిస్తున్న సిద్ధార్థ విక్రమ్ సింగ్ తదితరులు

క్లుప్తంగా

ఫంక్షన్ హాల్, దుకాణాలకు 2న టెండర్లు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలోని రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లతో పాటు పలు దుకాణాలకు వచ్చే నెల 2న టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీ కుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏసీ ఫంక్షన్ హాళ్ల లీజు హక్కులకు ఆన్‌లైన్‌లో http://tendr.telagana.gv.in వెబ్ సైట్ లేదా దేవస్థానం కార్యాలయంలో 2వ తేదీ ఉదయం 11 గంటల్లోగా రూ.2వేలు చెల్లించి టెండర్ దాఖలు చేసుకోవాలని సూచించారు. కొత్త కాంప్లెక్స్‌లోని షాపులను మూడేళ్ల కాల పరిమితికి, పాత కాంప్లెక్స్‌లోని షాపులు నంబర్ 03,04తో పాటు తలనీలాలు, చీరలు పోగుచేసుకోవడం, పూలదండల విక్రయం, ఫొటోలు తీసుకునేందుకు 11 నెలల కాల పరిమితి లైసెన్స్ హక్కులు దక్కుతాయని వివరించారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

సుజాతనగర్: మండల కేంద్రంతో పాటు సీతంపేట బంజర గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఏఓ నర్మద, ఎస్‌ఐ ఎం.రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పురుగుమందులు, ఎరువుల నిల్వలు తనిఖీ చేసి స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. పురుగుమందుల డబ్బాలపై ఉన్న బ్యాచ్ నంబర్లు, తేదీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువు ముగిసిన ఎరువులు, పురుగుమందులను విక్రయించవద్దని, గడువు తేదీని పరిశీలించిన తరువాతే రైతులకు అమ్మాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, ప్రతి రైతుకు విధిగా బిల్లు ఇవ్వాలని అన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


నాగరాజు (ఫైల్)


కృష్ణకుమార్ (ఫైల్)

వేంసూరు: ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు సహా ఇద్దరు మృతి చెందారు. వేంసూరు మండలంలో చోటు చేసుకున్న ఈ ప్రమా దం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన నగరకంటి నాగరాజు(38), ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన బొల్లిపోగు కృష్ణకుమార్ (12) తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జయలక్ష్మీపురం నుంచి కొండెగట్ల ప్రధాన రహదారి వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలోని కొండెగట్ల చెరువు మూలమలుపు వద్ద ద్విచక్ర అదుపు తప్పి కింద పడ్డాక రహదారిపై రాసుకుంటూ వెళ్లి ఎదురుగా కూలీలతో వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన నాగరాజు ఘటనాస్థలిలోనే మృతి చెందగా కృష్ణకుమార్‌ను ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు, అక్కడి నుంచి ఖమ్మం, ఆపై హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుల్లోకృష్ణ కుమార్ ఆరో తరగతి చదువుతుండగా, నాగరాజుకు కుమారుడు, కుమార్తె ఉన్నా రు. ఘటనపై కృష్ణకుమార్ తండ్రి ముత్తారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లు అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఫణీందర్

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్‌లో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి రూ.1.62కోట్లు కాజేసిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బోనకల్ మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్ లాభాల పేరిట నమ్మించారు. దీంతో ఆయన రూ.1.62కోట్లు చెల్లించగా.. ఆపై ముఖం చాటారు. దీంతో సదరు వ్యక్తి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా, సీపీ సునీల్‌దత్ పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. తొలుత ఏపీలోని విజయవాడ ప్రాంతానికి చెందిన షేక్ సుభానీని అదుపులోకి తీసుకుని విచారించగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దాసరి సునీల్‌కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణ కూడా ఈ మోసంలో ఉన్నట్లు తేలింది. ఈమేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, సీఐ యాసిన్‌అలీ, ఎస్‌ఐలు రంజిత్, విజయ్‌కుమార్, సిబ్బందిని సీపీ అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

'సహకారం'లో బదిలీలు

- తొలిసారిగా ఉద్యోగులకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉద్యోగుల డేటా, సర్వీసు వివరాల సేకరణ మరూ
- జిల్లాలో 21 సొసైటీల నుంచి 85 మందికి బదిలీకి అవకాశం



ఇల్లెందు పీఏసీఎస్ కార్యాలయం

ఇల్లెందురూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ అవసరాలు తీర్చడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వెనుదన్నుగా నిలుస్తున్నాయి. వారికి రుణాలు, ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో ఈ సంఘాలు ముఖ్య భూమిక పోషిస్తాయి. అయితే కొన్ని సొసైటీల్లో అవకతవకలు జరుగుతున్నాయని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం సహకార వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి సారించింది. తొలిసారిగా ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టింది.

85 మంది రెగ్యులర్ ఉద్యోగులు..

సహకార వ్యవస్థ ప్రక్షాళనకు 2022 డిసెంబర్‌లో బీజం పడింది. సుదీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అంతకంటే ముందు దశాబ్దాలుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలోని 21 పీఏసీఎస్‌ల్లో 17 మంది కార్యదర్శులు, 50 మంది స్టాఫ్ అసిస్టెంట్లను, 18 మంది సబ్ స్టాఫ్ ఉద్యోగులు.. మొత్తం 85 మందిని క్రమబద్ధీకరించింది.

బదిలీకి అడుగులు

ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల బదిలీపై దృష్టి సారించింది. ఈ మేరకు ఇటీవల జీఓ జారీ చేయగా.. సుదీర్ఘకాలంగా ఒకే చోట విధుల్లో కొనసాగుతున్న వారితోపాటు ఐదేళ్ల కనిష్ట సీనియారిటీ కలిగిన వారికి స్థానచలనం కల్పించాలని నిర్ణయించింది. జిల్లాలోని సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల డేటా, సర్వీసు వివరాలను ఇప్పటికే అధికారులు సేకరించారు. బదిలీల్లో పారదర్శకత పాటించేలా జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీని కూడా నియమించారు.

ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు

ఉద్యోగుల బదిలీలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్మనెంట్ ఉద్యోగుల్లో కార్యదర్శి వేతనం సీనియారిటీని బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండగా, స్టాఫ్ అసిస్టెంట్, సబ్ స్టాఫ్ ఉద్యోగులకు రూ.15వేల నుంచి రూ.25వేలతో పాటు సుమారు రూ.2వేలు హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తున్నారు. ఈ వేతనంతో సొంత మండలం వీడి విధులు నిర్వహించడం కష్టమవుతుందని కిందిస్థాయి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కార్యదర్శి హోదా గలవారిని బదిలీ చేసి, కిందిస్థాయి వారిని మినహాయించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



సహకార శాఖలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో తక్కువ వేతనం పొందుతున్న స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్‌లకు మినహాయింపు ఇవ్వాలి. ఉద్యోగులందరి బదిలీ తప్పదనకుంటే వేతనాలు పెంచాలి. ఆ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నాం. – రాజ్‌కుమార్, ఆఫీస్ అసిస్టెంట్ ఇల్లెందు

ఉత్తర్వులు జారీ అయ్యాయి..

జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల్లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటికే ఉద్యోగుల డేటా, సర్వీసు వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాం. బదిలీలకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. ఏ క్షణంలోనైనా ప్రక్రియ ప్రారంభం కావొచ్చు.

– ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి

యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి

సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ


అధికారులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

మణుగూరు టౌన్: శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తి ఎంతో అవసరమని, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి కేసీహెచ్‌పీ, ఓసీ–2లో ఉత్పత్తి, సరఫరా ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయా గనుల అధికారులతో సమావేశమై మాట్లాడారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలని, ఓసీల్లో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు సరిపడా మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బీటీపీఎస్‌కు రోజుకు 15 వేల టన్నులకు తగ్గకుండా బొగ్గు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, సింగరేణి అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిగౌడ్, వెంకట్రావ్, శ్యాంసుందర్, గౌడే, నాగరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులంతా లబ్ధి పొందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్


గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, వారు లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హతల మేరకు దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. టేకులపల్లి మండలం మూర్తులతండాకు చెందిన లక్ష్మయ్య తమ పొలంలో బోరు బావి తవ్వించుకోవడానికి అనుమతికి, పెనుబల్లి మండలం గట్టిగూడెంకు చెందిన నాగేశ్వరరావు కరెంటు బోరు మోటారుకు, జూలూరుపాడు మండలం కర్రెవారి గూడెంకు చెందిన రాంబాబు ట్రెకార్ రుణాలకు, అశ్వారావుపేట మండలం అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కృష్ణ మంచినీరు, రోడ్లు, కరెంటు ఏర్పాట్లకు, పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన వెంకటమ్మ క్రాప్ లోన్ కోసం, ఇంకా పలువురు వివిధ పనుల కోసం దరఖాస్తులు సమర్పించగా.. వాటిని సంబంధిత అధికారులకు అందించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దర్బార్‌లో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, గురుకులాల ఆర్సీఓ అరుణకుమారి, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ భాస్కరన్, ఏపీఓ వేణు, అధికారులు లక్ష్మీనారాయణ, సమ్మయ్య, ఉదయ్‌కుమార్, రమణయ్య, మనిధర్, ఆదినారాయణ, లింగా నాయక్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై నజర్!

ముమ్మరంగా తొలగింపు ప్రక్రియ

- కొత్త డ్రెయినేజీని దాటి రాకుండా చర్యలు
- హడావిడి చేసి వదిలేసిన మున్సిపల్ అధికారులు
- కొద్ది రోజులుగా పర్యవేక్షిస్తున్న పోలీసులు


రింగ్‌రోడ్ సెంటర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: అభివృద్ధి, సుందరీకరణ పనుల నేపథ్యంలో ఎట్టకేలకు రహదారి ఆక్రమణలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీని దాటి వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు కొన్ని రోజులుగా ఆక్రమణల తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో గత పది నెలలుగా భద్రాచలం, జంగారెడ్డిగూడెం, ఖమ్మం మార్గాల్లో సుమారు రూ.18 కోట్ల వ్యయంతో మెగా డ్రెయినేజీ నిర్మాణాలు, రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు సాగుతున్నాయి. ఆయా పనులు ప్రస్తుతం మరింత వేగవంతం కాగా, దశాబ్దాలుగా నెలకొన్న ఆక్రమణలపై స్థానిక పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ఆక్రమణదారులు నిర్లక్ష్యం చేస్తే కేసులు నమోదు తప్పవని హెచ్చరికలు జారీచేస్తున్నారు. కాగా, మున్సిపాలిటీ అధికారులు మాత్రం కొద్ది రోజులు హడావిడి చేసి ఆ తర్వాత మిన్నకుండి పోవడం విమర్శలకు తావిస్తోంది.

డ్రెయినేజీ దాటితే తిప్పలే..

అశ్వారావుపేట ప్రధాన మార్గాలతోపాటు నిత్యం రద్దీగా ఉండే స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్, పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్, మున్సిపల్ కార్యాలయం రోడ్డులో బడా వ్యాపారులతో పాటు చిరు వ్యాపారులు దశాబ్దాలుగా రోడ్లపైనే తిష్టవేశారు.అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో చిరువ్యాపారులు రహదారుల పక్కనే తోపుడు బడ్లుఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్టాండ్, రింగ్‌రోడ్ సెంటర్, పాత ఆంధ్రాబ్యాంక్ వీధిలో అయితే ఈ సమస్య మరింత గావేధిస్తోంది. ఈ ఆక్రమణలపై 20రోజుల క్రితం స్థానిక మున్సిపల్ అధికారులు దృష్టి సారించివ్యాపారులు, చిరు వ్యాపారులకు హెచ్చరికలుజారీ చేసి కొంతమేర ఆక్రమణదారులనునివారించారు. ఆ తర్వాత మిన్నకుండిపోవడంతో గత ఐదు రోజులుగా స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వ్యాపారులు కొత్తగానిర్మించిన డ్రెయినేజీని దాటి రావొద్దంటూమూడు రోజుల పాటు గడువు ఇచ్చారు. ఆగడువు ముగియగా జేసీబీలతో తొలగిస్తున్నారు.ఎన్నో ఏళ్లగా అక్రమణలో ఉన్న రింగ్‌రోడ్డు సెంటర్, పాత ఆంద్రాబ్యాంక్ వీధిలో కుడా రోడ్డుపై దుకాణాలను సోమవారం ఉదయం నుంచి తొలగించే పనులు చేపట్టారు. దీంతో వాహనదారులు, పాదాచారుల ఇబ్బందులు తొలగిపోతున్నాయి.

గిరిజన గురుకులంలో గందరగోళం

- 80 సీట్లు.. 120 మంది విద్యార్థులకు అనుమతి
- ఆ తర్వాత 40 మందిని నిరాకరించిన సుదిమళ్ల హెచ్‌ఎం


సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల

ఇల్లెందురూరల్: ప్రైవేటు పాఠశాలల్లో చదువు భారం కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదని భావిస్తున్న విద్యార్థులు గురుకులాల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో ఐదో తరగతి పూర్తయిన గిరిజన విద్యార్థులు ఆరో తరగతిలో చేరేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు వివిధ పాఠశాలల్లో సీట్లు కేటాయించారు. కాగా, సుదిమళ్ల గిరిజన గురుకులంలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉండగా, తమ పాఠశాలలో చేరాలంటూ 120 మంది విద్యార్థులకు సమాచారం అందించారు. దీంతో విద్యార్థులు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు పాఠశాలలో అందజేశారు. అయితే వారిలో 40 మంది సీట్లు రద్దు చేస్తునట్లు ఈనెల 14న హెచ్‌ఎం మాధవి సదరు విద్యార్థులకు సమాచారం అందించారు. ముందుగా సర్టిఫికెట్లు తీసుకుని నెల రోజులు గడిచాక సీట్లు రద్దు చేస్తున్నట్లు సమాచారం అందించడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గురుకులాల డీసీఓ అరుణకుమారి మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో అదనంగా పేర్లు నమోదు కావడంతో సీట్లు రద్దు చేశామని, ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగితా విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. అయితే అదనంగా కేటాయించిన సీట్లపై ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశామని, వారు తీసుకునే నిర్ణయం ఆధారంగా తాము తదుపరి చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి తెలిపారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాకు 18–25 ఏళ్ల వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ నుండి డిగ్రీ వరకు విద్యార్హతలు ఉన్న వారు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

కుప్పలు తెప్పలుగా ఉత్తరాలు!

- ఏడాదిగా బట్వాడా చేయని తపాలా ఉద్యోగి?
- ఉన్నతాధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు


ఉద్యోగి గదిలో పడేసిన ఉత్తరాలు, ఇతర పత్రాలు

అశ్వారావుపేటరూరల్: ఓ తపాలా ఉద్యోగి తన బాధ్యతలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును గ్రామస్తులు సోమవారం వెలుగులోకి తీసుకొచ్చారు. సదరు ఉద్యోగిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. అశ్వారావుపేట మండలం అనుపాక బ్రాంచ్ పోస్టుమాస్టర్ శశాంక్.. పోస్టు ద్వారా గ్రామస్తులకు వచ్చిన ఆధార్ కార్డులు, బీమా పత్రాలు, పాన్, ఏటీఎం కార్డులతో పాటు పోలీస్ శాఖ ద్వారా వచ్చే నోటీసులను సైతం గత ఏడాది కాలంగా ఆయా వ్యక్తులకు అందించకుండా తన వద్దే ఉంచుకున్నాడని, తాము అడిగితే రాలేదని సమాధానం చెప్పేవాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులకు పోస్టు ద్వారా వచ్చిన లేఖలను కూడా తన గదిలోనే పడేయడంతో అవి కుప్పలుగా పేరుకుపోయాయని తెలిపారు. తమకు రావాల్సిన ఆధార్, ఏటీఎం, పాన్ కార్డులు రాకపోవడంతో కొందరు అనుమానం వచ్చి ఉద్యోగి గదిలోకి వెళ్లి చూడగా కుప్పలుగా కనిపించడంతో ఆశ్చర్యపోయారు. వీటిపై సదరు ఉద్యోగిని స్థానికులు ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతడిపై అశ్వారావుపేటలోని ప్రధాన తపాలా కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం, నిందితుడు

ఇల్లెందు: పట్టణంలోని మహబూబాబాద్ క్రాస్ రోడ్ వద్ద పోలీస్ చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకున్నారు. అందులో సోదా చేయగా రూ.3లక్షల విలువైన మద్యం బాటిళ్లను గుర్తించారు. ఈ మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ సోమవారం వివరాలు వెల్లడించారు. మణుగూరుకు చెందిన బోడా బాలాజీ టీఎస్ 28 ఎం 7477 నంబర్ గల వాహనంలో రూ.3 లక్షల విలువైన ఇంపీరియల్ బ్లూ, ఎంసీ విస్కీ, రాయల్ స్టాగ్, మెన్షన్ హౌస్, ఆఫీసర్స్ చాయిస్, కింగ్ ఫిషర్, నాకౌట్ బీర్లు, డీకే క్వార్టర్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని, సరుకును సీజ్ చేశామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


పోలయ్య(ఫైల్)

దమ్మపేట: పామాయిల్ గెలలు కోస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని రంగువారిగూడెం శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన తంగెళ్లమూడి పోలయ్య(40) రంగువారిగూడెంలో పామాయిల్ గెలలు కోసే పనికి వెళ్లాడు. పొడవాటి లోహపు పైప్‌తో గెలలు కోస్తుండగా, విద్యుత్ లైన్‌కు పైప్ తగిలి షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లికి చెందిన పూనెం సరస్వతి(40) మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సరస్వతి ఆదివారం మాట్లాడుతూనే కిందపడిపోగా స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పాల్వంచ, కొత్తగూడెంలోని ఆస్పత్రులకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఈ మేరకు ఆమె కుమారుడు సాంబశివరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సురేశ్ తెలిపారు. కాగా, ఆమె మృతికి కారణం తెలియలేదని చెప్పారు.

గేదెను ఢీకొని వాహనదారుడు..

దమ్మపేట: గేదెను బైక్ ఢీకొట్టిన ఘటనలో గాయపడిన వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందాడు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామానికి చెందిన కూరం చంటి (36) తన బైక్‌పై దమ్మపేట మండలంలోని అంకంపాలెం వైపునకు సోమవారం రాత్రి వెళ్తున్నాడు. అయితే, గండుగులపల్లి శివారుకు చేరుకునే సరికి చీకట్లో రోడ్డుపై గేదెను గమనించక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంటి అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చంటి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కస్తూరి జింక అవశేషాలు స్వాధీనం!

గోప్యంగా ఉంచిన అటవీ శాఖ అధికారులు


అధికారులు స్వాధీనం చేసుకున్న అవశేషాలు

అశ్వారావుపేటరూరల్: అటవీ జంతువులకు సంబంధించిన అవశేషాలను ఫారెస్ట్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనను గోప్యంగా ఉంచడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ హఫీజ్ ఇంట్లో అటవీ జంతువులకు చెందిన విలువైన అవశేషాలు ఉన్నట్లు ఫారెస్టు రేంజర్ మురళికి సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి హఫీజ్ ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కస్తూరి జింకకు సంబంధించిన 12 అవశేషాలు స్వాధీనం చేసుకున్నారు. ఇవి బాల్ ఆకారంలో ఉండగా, సువాసన వెదజల్లుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వీటిని ఖరీదైన సుగంధ ద్రవ్యాల తయారీలో వినియోగిస్తారని, ఖరీదు కుడా రూ.లక్షల్లో ఉంటుందని తెలిసింది. కాగా, ఈ అవశేషాలను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపించి, దీనిపై విచారణ చేస్తున్నారు. కాగా, అరుదైన కస్తూరి జింక అవశేషాలు పెద్ద సంఖ్యలో ఉండడంతో వీటిని ఏ విధంగా సేకరించాడు.. ఎంత కాలం నుంచి ఈ దందా సాగుతోంది అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే మూడు రోజుల క్రితం అబ్దుల్ హఫీజ్‌ను వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్య, పిల్లలు కలిసి తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన తర్వాత సదరు వ్యక్తి చికిత్స పేరుతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, అదే రోజు అర్ధరాత్రి పరారయ్యాడు. అవశేషాల స్వాధీనంపై రేంజర్ వివరణ కోసం 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.